తీరుమారని రూపాయి..

ముంబై, జనవరి 28: రూపాయి మారకం విలువ మళ్లీ క్షీణించింది. మంగళవారం ట్రేడింగ్‌లో డాలర్‌తో పోల్చితే మరో 26 పైసలు పడిపోయి 86.57 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల భయం.. అంతర్జాతీయ మార్కెట్‌ను ఆవరించడంతో కరెన్సీ మార్కెట్‌పై ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. మరోవైపు చమురు దిగుమతిదారుల నుంచి వస్తున్న డిమాండ్‌తో బలపడుతున్న డాలర్‌కుతోడు, భారతీయ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్‌ఐఐ) పెట్టుబడులు తరలిపోతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి. ఈ ఒక్కరోజే ఎఫ్‌ఐఐలు రూ.4,920.69 కోట్ల పెట్టుబడుల్ని దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకున్నారు. సోమవారం కూడా రూపాయి మారకం విలువ 9 పైసలు దిగజారిన విషయం తెలిసిందే. ఇదే రోజు రూ.5,015.46 కోట్ల ఎఫ్‌ఐఐ పెట్టుబడులు తరలిపోయాయి.

జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ జోష్

హైదరాబాద్, జనవరి 28: జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. అక్టోబర్-డిసెంబర్‌లో రూ.202 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇది రూ.486 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. ఆదాయం రూ.1,738 కోట్ల నుంచి రూ.2,081 కోట్లకు పెరిగింది.

టీవీఎస్ ఆకర్షణీయం

TVS

న్యూఢిల్లీ, జనవరి 28: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.609.35 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.509.61 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.10,113.94 కోట్ల నుంచి రూ.11,134.63 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. గత త్రైమాసికంలో సంస్థ 12.12 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది. వీటిలో 5.56 లక్షల మోటార్‌సైకిళ్లు కాగా, 4.93 లక్షల స్కూటర్లు ఉన్నాయి.

భెల్ లాభం రెండింతలు

న్యూఢిల్లీ, జనవరి 28: విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భెల్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.134.70 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతిక్రతం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.60.31 కోట్ల లాభంతో పోలిస్తే మూడింతలు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం రూ.5,599. 63 కోట్ల నుంచి రూ.7,385 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ ఈకి సమాచారం అందించింది.

బీఈ ఎనర్జీతో ప్యూర్ ఈవీ

- **హైదరాబాద్‌లో తొలి యూనిట్**

ముంబై, జనవరి 28: హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న ప్యూర్ ఈవీ..ఫ్రెంచ్‌కకు చెందిన బీఈ ఎనర్జీతో జట్టుకట్టింది. అడ్వాన్స్‌డ్ లిథియం-అయాన్ బ్యాటరీ టెక్నాలజీని అందుబాటులోకి తేవడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్యూర్ ఈవీ వర్గాలు వెల్లడించాయి. దీర్ఘకాలికంగా ఈవీ కార్ల యజమానులకు అయ్యే ఖర్చును తగ్గించడానికి, ముఖ్యంగా నూతన బ్యాటరీ కొనుగోలుకు అయ్యే ఖర్చును తగ్గించడానికి వీలు పడనున్నదని వెల్లడించింది. ప్యూర్ ఈవీతో కుదుర్చుకున్న ఒప్పందంతో బీఈ ఎనర్జీ దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టినట్లు అయింది. ఇరు సంస్థల భాగస్వామ్యంలో భాగంగా హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఐడీఏ వద్ద ఏర్పాటు చేస్తున్న యూనిట్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి రానున్నట్లు ప్యూర్ ఈవీ ఎండీ, ఫౌండర్ నిశాంత్ దొంగరి తెలిపారు.

పన్ను ఊరట దక్కేనా?

అటు పాతది.. ఇటు కొత్తది

రాబోయే బడ్జెట్‌లో ఆదాయ పన్ను విధానాల్లో ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్న మార్పులివే

న్యూఢిల్లీ, జనవరి 28: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం (ఫిబ్రవరి 1) బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) విధానానికి సంబంధించి ట్యాక్స్‌పేయర్స్, సగటు వేతన జీవులు భారీ ఆశల్నే పెట్టుకున్నారు. పాత, కొత్త ఆదాయ పన్ను విధానాలను అనుసరించేవారు మాకివి కావాలన్న డిమాండ్లను వ్యక్తం చేస్తున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ క్షీణత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తగ్గుతున్న వృద్ధిరేటు అవకాశాలు, అధిక వడ్డీరేట్లు, నిరాశపరుస్తున్న ఉత్పత్తి, మందగించిన వినిమయ సామర్థ్యం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం వంటివి ఇప్పుడు మోదీ సర్కారుకు సవాల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ ఎవరి అంచనాల్ని, మరెవరి ఆశల్ని ఎంతవరకు నెరవేరుస్తుందన్నది మిక్కిలి ప్రాధాన్యతగా నిలుస్తున్నది.

ఇదీ సంగతి..

పన్ను కోతలు, మినహాయింపులు లేకుండా సరళతరంగా రూపొందించినదే కొత్త పన్ను విధానం. 2020 బడ్జెట్‌లో దీన్ని మోదీ సర్కారు పరిచయం చేసింది. వార్షిక ఆదాయ పరిమితులు, దానికి తగ్గట్టు పన్ను శ్లాబులే ఇందులో ఉంటాయి. ఇక పాత పన్ను విధానంలో రకరకాల సెక్షన్ల కింద వివిధ పెట్టుబడులు, పొదుపు, ఆదాయ-వ్యయాలపై పన్ను కోతలు, మినహాయింపులు వర్తిస్తాయి. ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రకారం ప్రస్తుతం దేశంలోని 72 శాతం మంది ట్యాక్స్‌పేయర్స్.. కొత్త ఆదాయ పన్ను విధానాన్నే అనుసరిస్తున్నారు. 28 శాతం మంది పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నారు. వీరిని కూడా కొత్త ఆదాయ పన్ను విధానంలోకే తేవాలని గత కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే ప్రతీ బడ్జెట్‌లో పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదు. కొత్త పన్ను విధానానికే మెరుగులు దిద్దుతూ వస్తున్నది. మరి ఈసారైనా ఈ రెండు విధానాల్లో మార్పులు కావాలని కోరుతున్న ట్యాక్స్‌పేయర్స్ ఆశలు ఫలిస్తాయా? లేక ఎప్పట్లాగే కొత్త పన్ను విధానానికి సంబంధించి వచ్చే డిమాండ్లపైనే దృష్టి సారిస్తారా? అన్నది వేచిచూడాల్సిందే.

ప్రస్తుతం ఆదాయ పన్ను శ్లాబు రేట్లు

పాత పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	60 ఏండ్లలోపు	60-80 ఏండ్లు	80 ఏండ్లు పైబడినవారు
2.50 లక్షల వరకు	లేదు	లేదు	లేదు
2,50,001-3,00,000	5%	లేదు	లేదు
3,00,001-5,00,000	5%	5%	లేదు
5,00,001-10,00,000	20%	20%	20%
10 లక్షలపైన	30%	30%	30%

కొత్త పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	ఆదాయ పన్ను రేట్లు
3 లక్షల వరకు	లేదు
3,00,001-7,00,000	5% (సెక్షన్ 87ఎ కింద ట్యాక్స్ రిబేటు)
7,00,001-10,00,000	10%
10,00,001-12,00,000	15%
12,00,001-15,00,000	20%
15 లక్షలపైన	30%

బడ్జెట్‌లో ట్యాక్స్ పేయర్స్ డిమాండ్లు..

పాత పన్ను విధానంలో..

- **పన్ను మినహాయింపు:** కనీస పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలి.
- **స్టాండర్డ్ డిడక్షన్:** కొత్త పన్ను విధానంలో ఉన్నట్టుగానే స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75,000కు పెంచాలి.
- **గృహ రుణం:** సెక్షన్ 24 కింద గృహ రుణం ఈఎంఐలో వడ్డీకి సంబంధించి ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలుగా ఉన్న పన్ను మినహాయింపు పరిమితిని రూ.3 లక్షలకు పెంచాలి.
- **సెక్షన్ 80సీ, డీ:** సెక్షన్ 80సీ కింద వర్తిస్తున్న గరిష్ఠ పన్ను మినహాయింపు పరిమితిని ఏటా రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచాలి. 80డీ కిందనున్న పన్ను ప్రయోజనాలను రూ.25వేల నుంచి రూ.40వేలకు పెంచాలి. సీనియర్ సిటిజన్లకైతే ఇప్పుడున్న రూ.50వేలు కాకుండా రూ.75వేలుగా నిర్ణయించాలి.

కొత్త పన్ను విధానంలో..

- **పన్ను రేట్లు:** వార్షిక ఆదాయం రూ.12-15 లక్షల మధ్య ఉంటే పన్ను రేటును 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలి. రూ.15-20 లక్షల మధ్య ఉన్నట్టైతే ఇప్పుడున్న 30 శాతం నుంచి 20 శాతానికి తీసుకురావాలి. రూ.20 లక్షలపైన వార్షిక ఆదాయం ఉన్నవారికి 30 శాతం విధించాలి. దీనివల్ల మధ్యతరగతి, ముఖ్యంగా వేతన జీవులకు ఊరట లభిస్తుంది. అలాగే ఆర్థికాభివృద్ధికి కీలకమైన వినిమయ శక్తి పుంజుకుంటుందని చెప్పున్నారు.
- **స్టాండర్డ్ డిడక్షన్:** రూ.75వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలి.
- **ఎన్‌పీఎస్:** నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)కు వెళ్లే ఉద్యోగుల విరాళాలకు సెక్షన్ 80సీసీడీ(1బీ) కిందనున్న రూ.50వేల పన్ను మినహాయింపును వర్తింపజేయాలని కొత్త పన్ను విధానంలోని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. అప్పుడే రిటైర్మెంట్ నిధిని పెంపొందించుకోవడం, ఆర్థిక భద్రత మెరుగుపడటం, ప్రావిడెంట్ ఫండ్‌కే కాకుండా ఎన్‌పీఎస్‌కూ ఆదరణ పెరగడం జరుగుతుందని మెజారిటీ పన్ను చెల్లింపుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాత పన్ను విధానంలో సెక్షన్ 80సీసీడీ (1) కింద ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపు ఉన్నది. అయితే సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద ఎన్‌పీఎస్‌కు చెల్లించే మొత్తాలకు సంబంధించి అదనంగా మరో రూ.50,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు. దీంతో ఈసారి బడ్జెట్‌లో ఈ సదుపాయం కొత్త పన్ను విధానం ఎంచుకొన్న ట్యాక్స్‌పేయర్స్‌కూ కల్పించాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

వరుస పతనాలకు బ్రేక్

సెన్సెక్స్ 535, నిఫ్టీ 128 పాయింట్ల లాభం

ముంబై, జనవరి 28: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనాలకు బ్రేక్ పడింది. బ్యాంకింగ్, వడ్డీరేటుకు సంబంధించిన రంగాల షేర్లకు లభించిన మద్దతుతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఆర్థిక వ్యవస్థలోకి భారీగా నిధులను చొప్పించడానికి రిజర్వుబ్యాంక్ సిద్ధమవుతున్నట్లు వచ్చిన వార్తలు మదుపరులను కొనుగోళ్లవైపు నడిపించాయి. దీంతో ఇంట్రాడే వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 535.24 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 75,901.41 వద్ద ముగియగా, 128.10 పాయింట్లు అందుకొని నిఫ్టీ 22,957.25 వద్ద స్థిరపడింది. గడిచిన రెండు రోజులుగా భారీగా పతనమైన సూచీలకు రిలీఫ్ ర్యాలీ దొరికిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా, జొమాటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, మారుతి, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్‌ఫార్మా, లార్సెన్ అండ్ టుబ్రో, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, నెస్లె, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్ సూచీ అత్యధికంగా 1.49 శాతం లాభపడగా, ఆర్థిక సేవలు 1.45 శాతం, రియల్టీ 1.27 శాతం, ఆటో 1.16 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, యుటిలిటీ, క్యాపిటల్ గూడ్స్, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ, ఐటీ రంగ షేర్లు పతనం చెందాయి.

పన్నులు పక్కదారి పట్టకుండా అలెరియా ఏఐ

- **రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ): అలెరియా ఏఐ(కృత్రిమ మేధస్సు)తో పన్నుల రాబడి పక్కదారి పట్టకుండా అరికట్టవచ్చని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పన్నుల వసూలు, ఇతర రాబడి మార్గాల్లో ఆదాయం నష్టపోకుండా చూసే 'అలెరియా ఏఐ' టెక్నాలజీ పనితీరు ఆసక్తికరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అలెరియా ఏఐ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో తన కార్యాలయంలో ఇచ్చిన ప్రజెంటేషన్‌ను మంత్రి తిలకించారు. ఆఫ్‌లైన్‌లో పనిచేసే ఈ టూల్‌ను ప్రభుత్వ విభాగాలకు అనుసంధానిస్తే రాబడిలో నష్టపోతున్న 30 శాతాన్ని తిరిగి పొందవచ్చని సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. వివిధ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికలో అర్హులు మాత్రమే ప్రయోజనం పొందేలా అలెరియా ఏఐ సహాయ పడుతున్నదని వారు వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో ఐబీటీ సీఈవో మన్సూర్ అలీ ఖాన్, అలెరియా సీఈవో ఎరిక్ లియాండ్రీ, ఇన్నోలాజిక్ సీఈవో శివ దొండపాటి తదితరులు ఉన్నారు.

బాబుది బ్రాడ్ మెంటాలిటీ

'దావోస్‌లో మైనస్ 8 నుంచి 11 వరకు టెంపరేచర్ ఉన్నది. ఆ చలికి మేమంతా స్వెట్టర్లు వేసుకుంటే, చంద్రబాబు మాత్రం రెగ్యులర్ డ్రెస్‌లోనే ఉన్నారు. ఆయన ఆ వయసులోనూ ఎంతో ఫిట్‌గా యాక్టివ్‌గా ఉన్నారు. నిజంగా ఆయన గ్రేట్' అని శ్రీధర్‌బాబు కొనియాడారు. దావోస్ పర్యటన నుంచి వచ్చిన శ్రీధర్‌బాబు చిట్‌చాట్ చేస్తూ.. ఏపీకి గ్లోబల్ కెపాసిటీ ఉన్నదని, చంద్రబాబుతో మాట్లాడినప్పుడు ఆయన బ్రాడ్ మెంటాలిటీ తెలిసిందని పేర్కొన్నారు. ఏపీకి అపార వనరులు, అతి పెద్ద కోస్టల్ ఏరియా ఉన్నదని, పెద్ద పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్నదని చెప్పారు. దావోస్‌లో ఏపీ ప్రభుత్వం అనేక ఎంఓయూలు చేసుకున్నదని, కానీ అక్కడ ప్రకటించకుండా గోప్యత పాటించారన్నారు. పెట్టుబడులు సాధించేందుకు బాబు చేసిన ప్రయత్నాలు అల్టిమేట్ అని మెచ్చుకున్నారు.

రెండు ఐటీ పార్కులు

హైదరాబాద్ శివారుల్లో కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన "డ్యూ' సాఫ్ట్ వేర్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. అందుకే హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి, నగర శివారుల్లో ఏయే ప్రాంతాలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తున్నదని వివరించారు.

ఐదేండ్లలో 75 వేల కోట్ల పెట్టుబడి

- **సీఎండీ అమితావ ముఖర్జీ వెల్లడి**

హైదరాబాద్, జనవరి 28: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఎన్‌ఎండీసీ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 100 మిలియన్ టన్నులకు పెంచుకోవడానికి రూ.70 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ సీఎండీ అమితావ ముఖర్జీ తెలిపారు. ఈ పెట్టుబడులు కేవలం వ్యాపార అవసరాలకోసం కాకుండా, అంతర్జాతీయ మైనింగ్ విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వినియోగించనున్నట్లు చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో వాటాదారులతో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజన్ 2030ని ప్రకటించారు. వచ్చే ఐదేండ్లలో ఖనిజ ఉత్పత్తి సామర్థ్యాన్ని 100 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు

మాట్లాడుతున్న జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ

కామారెడ్డి, జనవరి 28 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో ఉన్న కేజీబీవీలో పరీక్షల సమయంలో విద్యార్థులు అనుసరించాల్సిన ప్యూహాలు, మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి మానసిక సమస్యలు ఎదురైనా దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని లేదా టెలీ మానస్ ద్వారా ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించాలని తెలిపారు.కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి లావణ్య, జిల్లా సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్ కుమార్, ఆరోగ్య కార్యకర్త సుజాత, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, స్వప్న, సృజన, శిరీష, పుష్పలత, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల గుర్తింపు

కామారెడ్డి, జనవరి 28 : కామారెడ్డిలోని ఆర్ బీనగర్ కాలనీలో మంగళవారం బడి బయట ఉన్న ఇద్దరు పిల్లల్ని అధికారులు గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులకు చదువు, భవిష్యత్తుపై అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. చిన్నారులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, సీఆర్‌పీ చిరంజీవి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు, జనవరి 28 : మండలంలోని మొటాట్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు భీమరి రాజయ్య, బోయిన సత్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వారి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట సింగిల్ విండో మాజీ చైర్మన్ నర్సారెడ్డి, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, కమలాకర్, ప్రభాకర్, నర్సారెడ్డి, బాపిరెడ్డి, చంద్రం, పెద్దమాల్లారెడ్డి మాజీ ఎంపీటీసీ సాయాగౌడ్ ఉన్నారు.

ఆఫ్‌లైన్‌లో ఇంటి నిర్మాణ అనుమతులు?

బీబీపేట్(దోమకొండ), జనవరి 28: దోమకొండ పంచాయతీలో ఇష్టారాజ్యం పాలన సాగుతున్నదని స్థానికులు చెబుతున్నారు. గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సేవలందించాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరిస్తున్నారు. పంచాయతీ నుంచి పొందే ప్రతి ధ్రువపత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా అందించాల్సి ఉంటుంది. కానీ కొంతమంది అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు కాకుండా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్న ఓ అధికారిణిపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయి. సాధారణ వ్యక్తులు పనికోసం వెళ్తే కసురుకునే సదరు అధికారిణి, తనకు సంబంధించిన వారి ఫైళ్లను మాత్రం నిమిషాల్లో చేసి ఇచ్చేవారని సమాచారం.

విచారించిన డీఎల్‌పీవో శ్రీనివాస్

పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, రికార్డులను తారుమారు చేసిన ఇటీవల భిక్కనూర్ మండలంలోని ఓ గ్రామానికి బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి దోమకొండ ఎంపీడీవోపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో మంగళవారం పంచాయతీకి చేరుకొని రికార్డులను పరిశీలించారు. 'బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శిని దోమకొండ పంచాయతీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడాం. నిబంధనలకు విరుద్ధంగా రూపొందించిన రికార్డులను ఆమె ముందే పరిశీలించాం. తుది నివేదికను అందజేస్తామం' అని డీఎల్‌పీవో శ్రీనివాస్ తెలిపారు.

దోమకొండ గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న కామారెడ్డి డీఎల్‌పీవో శ్రీనివాస్

అందుబాటులో ఉండాలి

మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

నస్రుల్లాబాద్, జనవరి 28 : గ్రామాల్లో ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9 గంటల నుంచి అందుబాటులో ఉండాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. నస్రుల్లాబాద్‌లోని సమీకృత మండల భవన కార్యాలయ సముదాయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి పంచాయతీ కార్యదర్శి రోజూ డ్రైనేజీలు, రోడ్లు పరిశుభ్రం చేయించి, చెత్త సేకరించేలా చూడాలని ఆయన సూచించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య

బాన్సువాడ, జనవరి 28 : ప్రభుత్వం ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని నిలబెట్టుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య డిమాండ్ చేశారు. బాన్సువాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తపస్ నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తా మని ఇచ్చిన వాగ్ధానాన్ని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు జీపీఎస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్ ఆర్య, అధ్యక్షుడు ఐటీ విభాగం రమేశ్ కుమార్, లక్ష్మణచారి, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవరెడ్డి, బూనేకర్ సంతోష్, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

SUPER HIT... నేడే చూడండి

PVR ఆర్.కె - బంజారాహిల్స్ 4.55PM
PVR పెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.40PM
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 10.55PM
PVR నెక్టస్ మాల్ - కూకట్‌పల్లి 1.00PM
PVR గలేరియా - పంజాగుట్ట 7.55PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 11.00PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 10.55PM
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి 1.35PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 4.30PM
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి 7.05PM
PVR PRISM మాల్ - గచ్చిబౌలి 10.40PM
INOX బంజారాహిల్స్ - బంజారాహిల్స్ 10.15PM
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 2.30PM
INOX పత్నీనెక్లెస్ మాల్ - కవాడిగూడ 4.00PM
INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ 1.40PM
Cinepolis లులు మాల్ - కూకట్‌పల్లి 2.40PM
Cinepolis CCPL - మల్కాజ్‌గిరి 1.15PM
Cinepolis డి.ఎల్.ఎస్ - ఉప్పల్ 1.15PM
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్ 4.55PM
Cinepolis సుధ - శాలిబండ 2.10P